సాక్షి నిజామాబాద్

శుక్రవారం : 8 : నవంబర్ : 2024



ఆర్టీసీ స్పెషల్ తగ్గింపు

వివాహాలు, దైవదర్శనాలతోపాటు తీర్థ, విహార యాత్రలకు వెళ్లే వారికి ఆర్టీసీ స్పెషల్ బస్సులపై 20 శాతం ధరలను తగ్గించింది.

- 8లో ▸



గడువు లోగా సర్వే..

సమగ్ర కుటుంబ సర్వేను గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి శరత్ సూచించారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.6 /15.5

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

గడుగును సన్మానించిన పీసీసీ చీఫ్



నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్‌ను టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ సన్మానించారు. గురువారం హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడిని గడుగు గంగాధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. రైతు కమిషన్ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టిన గడుగును మహేశ్ అభినందించి సన్మానించారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు.

కొనసాగుతున్న రైల్వే పనులు



ఖలీల్‌వాడి: నగరంలోని అర్సపల్లి వద్ద రైల్వే గేటు వద్ద పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి(12గంటలకు)రైల్వే గేటును మూసివేశారు. గేటు తిరిగి ఆదివారం రాత్రి 11గంటల తరువాత తెరుచుకోనుంది. వాహనాదారులు ఈ రూట్‌లో వెళ్లొద్దని, బైపాస్‌రోడ్డు, ఖానాపూర్ మీదుగా రాకపోకలు సాగించాలని ఆరో టౌన్ పోలీసులు బ్యానర్‌ను ఏర్పాటు చేశారు.

10న మహాపథ సంచలన్

సుభాష్‌నగర్ : ప్రపంచంలోనే అతిపెద్ద సామాజిక సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రారంభమై 100ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిజామాబాద్ నగరంలో 10వ తేదీన మహాపథ సంచలన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్ నగర కార్యవాహ అర్గుల సత్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నగరంలోని ఖిల్లా రామాలయం, రాజీవ్ గాంధీ ఆడిటోరియం, శంకర్ భవన్ నుంచి వేర్వేరుగా పథ సంచలన్లు (ర్యాలీ) ప్రారంభమై శివాజీనగర్‌లోని శివాజీ చౌక్ వద్ద త్రివేణి సంగమంగా ఒకేచోట కలిసే సుందర దృశ్యాన్ని తిలకించేందుకు హిందువులందరినీ ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. సంచలన్ అనంతరం శివాజీనగర్ ఐటీఐ కళాశాల మైదానంలో సార్వజనికోత్సవాన్ని నిర్వహిస్తామని, ముఖ్యఅతిథిగా విశ్రాంత చీఫ్ ఇంజినీర్ గజవాడ హనుమంతరావు, ప్రధాన వక్తగా ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ సహ ప్రాంత ప్రచారక్ కల్వగురి ప్రభుకుమార్ హాజరవుతారని తెలిపారు.

11 నుంచి జోనల్ స్పోర్ట్స్ మీట్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను ఈనెల 11 నుంచి 14వ తేదీవరకు కంజర్ గురుకుల పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ విజయలలిత తెలిపారు. మండలంలోని కంజర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల్ జిల్లాల్లోని 14 బాలికల గురుకుల పాఠశాల నుంచి 1190 మంది విద్యార్థినులు స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొంటారన్నారు. అథ్లెటిక్స్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్, చెస్, క్యారం తదితర క్రీడాంశాల్లో అండర్ -14, 17, 19 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతం చేసేందుకు 12 ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ డి ఉదయశీల, ఎస్‌వీపీ జే వినోద, జేవీపీ పి సునీత, ఎన్ లత తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

- టూరిజం శాఖ ఎస్టేట్ అధికారి రామ్మోహన్

నిజాంసాగర్ : నిజాంసాగర్ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని టూరిజం శాఖ ఎస్టేట్ అధికారి రామ్మోహన్ పేర్కొన్నారు. అచ్చంపేట శివారులో గోల్ బంగ్లా వద్ద 121/2ఏ సర్వే నంబర్‌లో ఉన్న 12.3 ఎకరాల భూమిని గురువారం పర్యాటక శాఖకు అప్పగించారు. ఆ భూమిని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పర్యాటక ప్రాంతం కళ త్వరలో నెరవేరబోతుందన్నారు. తహసీల్దార్ భిక్షపతి, నీటిపారుదలశాఖ ఏఈ శివప్రసాద్ తదితరులున్నారు.

మహా ఆంక్షలతో ఆదాయానికి గండి

- మంజీర నూతన వంతెన మీదుగా భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు
- 20 టన్నులకు మించి ఉంటే అనుమతి నిరాకరిస్తున్న మహారాష్ట్ర అధికారులు
- సాలూర చెక్‌పోస్టు ద్వారా భారీగా తగ్గిన ఆదాయం
- మూడేళ్లలో సుమారు రూ.10 కోట్ల మేర నష్టం
- ప్రస్తుతం నెలకు రూ.4లక్షలకు మించని రాబడి

సరుకు రవాణా చేసే భారీ వాహనాలను మంజీర నదిపై నూతనంగా నిర్మించిన వంతెన మీదుగా మహారాష్ట్ర అనుమతించడం లేదు. దీంతో సాలూర చెక్‌పోస్టు ద్వారా తెలంగాణ ప్రభుత్వానికి సమకూరాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. పాత వంతెన శిథిలావస్థకు చేరడంతో మూడేళ్ల క్రితమే 20 మెట్రిక్ టన్నులకు మించి బరువున్న వాహనాలను అనుమతించలేదు. ప్రస్తుతం నూతన వంతెన నిర్మించినప్పటికీ పాత ఆంక్షలనే అమలు చేస్తున్నారు.



సాలూర శివారులో మంజీరపై నిర్మించిన భారీ వంతెన



మంజీర నది వద్ద ఆర్టీవో చెక్‌పోస్టు

బోధన్: మంజీర నదిపై నూతనంగా నిర్మించిన వంతెన మీదుగా భారీ వాహనాల రాకపోకలపై మహారాష్ట్ర ఆంక్షలు విధించడంతో సాలూర చెక్‌పోస్టు ద్వారా సమకూరే ఆదాయానికి గండిపడుతోంది. 20 మెట్రిక్ టన్నులకు మించి బరువున్న సరుకు రవాణా వాహనాలను అక్కడి అధికారులు అనుమతించడం లేదు. సాలూర గ్రామ శివారులో ఆర్టీవో, ఎక్సైజ్‌శాఖ అంతర్‌రాష్ట్ర చెక్ పోస్టులున్నాయి. 'మహా' ఆంక్షల కారణంగా ఆర్టీవో చెక్ పోస్టు ద్వారా ఆశించిన మేర ఆదాయం సమకూరడం లేదు.

ఏటా రూ.3 కోట్ల మేర నష్టం

సాలూర ఆర్టీవో అంతర్‌రాష్ట్ర చెక్ పోస్టుకు మూడేళ్ల క్రితం వరకు పర్మిట్లు, అపరాధ రుసుము, ఓవర్ లోడ్ వాహనాలు ఇలా వివిధ రూపాల్లో ఏటా రూ.2.50 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఆదాయం సమకూరేదని అంచనా. ఈ లెక్కన మూడేళ్లుగా సుమారు రూ.10 కోట్ల ఆదాయం రాకుండా పోయింది. వంతెన మీదుగా రవాణాపై ఆంక్షలు, వాహనాల దారి మళ్లింపు కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం నెలకు రూ.4లక్షలకు మించి ఆదాయం సమకూరడం లేదని తెలుస్తోంది.

దారి మళ్లింపు

నూతన బ్రిడ్జి మీదుగా భారీ వాహనాలపై ఆంక్షలు ఉండడంతో రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న బోధన్ మండలం ఖండ్‌గాం, రెంజల్ మండలం కందకుర్తి, పోతంగల్ మండల కేంద్రం మీదుగా దారి మళ్లిస్తున్నారు. దీంతో అంతర్‌రాష్ట్ర చెక్ పోస్టుమీదుగా వాహనాల రాకపోకలు తగ్గిపోయాయి. వాహనదారులు సైతం 60 నుంచి 70 కిలోమీటర్ల మేర ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ఆరుతడి పంటలైన సోయా, శనగ, సన్‌ఫ్లవర్, పత్తి మార్కెట్లు మహారాష్ట్ర ప్రాంతంలో ఉన్నాయి. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కొనుగోలు చేసిన పంట దిగుబడులను మహారాష్ట్ర ప్రాంతానికి తరలించేందుకు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మరింత ఆలస్యం..

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వంతెనపై విధించిన ఆంక్షలను అధికారికంగా రద్దు చేయడం మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. మన రాష్ట్ర ఆదాయానికి భారీగా నష్టం చేకూరుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

కేంద్రం నిధులతో భారీ వంతెన

మహారాష్ట్ర ఇంజినీరింగ్ శాఖ ప్రతిపాదనల మేరకు మంజీరపై భారీ వంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.120 కోట్లు మంజూరు చేయగా, ఏడాదిన్నర క్రితం పనులను ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేశారు. పాత రెండు వంతెనల మధ్య ఈ భారీ వంతెనను 22 పిల్లర్లతో నిర్మించారు. పై భాగంలో విడివిడిగా రెండు వరుసల రోడ్డు నిర్మాణం, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఆరు నెలల క్రితం అనధికారికంగా వాహనాల రవాణాకు అనుమతి ఇచ్చారు. అయితే భారీ వాహనాల రాకపోకలపై గతంలో విధించిన ఆంక్షలను కొనసాగిస్తున్నారు. కొత్త వంతెను ఆ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించక పోవడం కారణంగా ఆంక్షలు యథావిధిగా అమలు చేస్తున్నారని మన రాష్ట్రానికి చెందిన చెక్‌పోస్టు అధికారులు చెబుతున్నారు.



మంజీర నదిపై కొత్త, పాత వంతెనలు

శిథిలావస్థలో పాత వంతెనలు

నిజాం హయాంలో మంజీర నదిపై రెండు రాష్ట్రాల మధ్య 1932లో రాతి వంతెన(లోలెవల్)ను నిర్మించారు.

ఆ తరువాత ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 1984 – 85లో హైలెవల్ వంతెను నిర్మించాయి. హైలెవల్ వంతెన నాలుగేళ్ల క్రితమే బీటలు వారి ప్రమాదకరంగా మారడంతో మహారాష్ట్ర అధికార యంత్రాంగం మరమ్మతులు చేయించినా ఫలితం లేకుండాపోయింది. మూడేళ్ల క్రితమే వంతెన మీదుగా 20 మెట్రిక్ టన్నులకు మించి బరువున్న వాహనాల రవాణాను మహారాష్ట్ర నిషేధించింది. ప్రస్తుతం రెండు వంతెనలు శిథిలావస్థకు చేరాయి.



మంజీర నదిపై నిజాంకాలంలో నిర్మించిన రాళ్ల వంతెన

పసిడి పరుగుకు బ్రేక్!



- భారీగా తగ్గిన బంగారం ధర
- శుభకార్యాలు, పెళ్లిళ్ల సీజన్‌లో కొనుగోలుదారులకు ఊరట

నిజామాబాద్ రూరల్: పసిడి పరుగుకు కాస్త బ్రేక్ పడడంతో కొనుగోలుదారులు ఊపిరిపీల్చుకున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం, అంతర్జాతీయ మార్కెట్‌లో పరిణామాల నేపథ్యంలో గురువారం 24 క్యారెట్‌ల బంగారం ధర ఏకంగా రూ.2వేల వరకు తగ్గింది. బంగారం ధర మరింత తగ్గి రూ.75 వేలకు రావొచ్చని వ్యాపారా లు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం శుభకార్యాలు, పెళ్లిళ్ల సీజన్‌కావడంతో వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. షోరూమ్‌లలో నగలు, సిల్వర్, గోల్డ్ మర్చంట్‌లలో బంగారం కొనుగోళ్లు ఊపందుకుంటాయని వ్యాపారులు ఆశిస్తున్నారు. దీపావళి రోజున 10 గ్రాముల 24 క్యారెట్ల ధర రూ.82,400, 22 క్యారెట్ల ధర రూ.76,035 పలకగా, గురువారం రోజున 24 క్యారెట్ల ధర రూ.79, 600కు, 22 క్యారెట్ల ధర రూ.73,445కు పడిపోయింది. అదే విధంగా కిలో వెండి ధర గతంలో లక్షపైగా ఉండగా, ప్రస్తుతం రూ.96,000కు తగ్గింది.

అందుబాటు ధరలోకి..



బంగారం ధర మరింత అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. కార్తీక మాసంలో పెళ్లిళ్లు, శుభకార్యాలు ఉండడంతో కొనుగోళ్లు ఊపందుకుంటాయి. సామాన్యులు బంగారం ధర తగ్గడంతో కొంత ఊరట చెందారు.

– సిలివేరి గణేశ్, శ్రీరాజరాజేశ్వరి జువెల్లర్స్

సన్నరకాలకు బోనస్ పొందాలి

- దొడ్డు, సన్నరకం ధాన్యం కొనుగోళ్లకు వేర్వేరు కేంద్రాలు
- సేకరించిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలి
- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి శరత్



ఇందల్వాయిలో రైతులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శరత్

ఇందల్వాయి: రైతులు సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి బోనస్ పొందాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి, గిరిజన అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఏ శరత్ అన్నారు. ఇందల్వాయి మండలంలోని గన్నారం, చాంద్రాయన్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి శరత్ గురువారం పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం దొడ్డు, సన్నరకం ధాన్యాన్ని సేకరించేందుకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. సేకరించిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకి తరలించాలని, రైతుల వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ చేసి ధాన్యం డబ్బులు వెంటవెంటనే రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గన్నీ బ్యాగుల కొరత, రవాణాలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

జిల్లాలో 673 కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో 673 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. 4,33,772 ఎకరాల్లో వరి సాగు చేయగా అందులో 3.71 లక్షల ఎకరాల్లో సన్న రకాలు సాగు చేశారని ప్రత్యేకాధికారికి వివరించారు. సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడిలో 80 శాతం సన్న రకం ధాన్యం ఉందని, 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. 439 కేంద్రాలు దొడ్డు రకాల కోసం, 234 కేంద్రాలు సన్న రకాల కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 370 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ కొనసాగుతోందన్నారు. వారివెంట అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, సీఈవో రతన్ తదితరులున్నారు.

కొండపైకి చేరిన నృసింహుడు

- నింబాచల బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- కనుల పండువగా పల్లకీసేవ



పల్లకీ సేవలో పాల్గొన్న పండితులు, భక్తులు



పల్లకీలో ఉత్సవ మూర్తి

మోర్తాడ్: జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భీమ్‌గల్ నింబాచలం(లింబాద్రిగుట్ట) బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్తీక మాసంలో 11రోజులపాటు కొనసాగనున్న బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజైన గురువారం స్వామివారి పల్లకీసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని గ్రామాలయంలోని ఉత్సవ మూర్తులకు పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్పాలంకృతుడైన లక్ష్మీనృసింహుడు మంగళవాయిద్యాలు, మేళతాళాలు, భక్తుల జయజయధ్వనాల మధ్య పల్లకీలో కొండపైకి చేరారు. భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. నందిగల్లీ, నందీశ్వరాలయం, హరిజనవాడ, ముచ్కూర్ క్రాస్ రోడ్డు, పురాణిపేట్ మీదుగా కనులపండువగా పల్లకీసేవ కొనసాగింది.

'ప్రైవేట్'కు విక్రయించిన వారికి బోనస్ ఇవ్వాలి



మోర్తాడ్(బాల్కొండ): సకాలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభంకాకపోవడంతో చాలా మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు సన్నరకం ధాన్యం విక్రయించారని, వారికి సైతం రూ.500 బోనస్ ఇవ్వాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తున్న రైతులను గురువారం మోర్తాడ్ మండల కేంద్రంలో ఆయన కలిసి మాట్లాడారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో వ్యాపారులకు విక్రయిస్తున్నామని రైతు తెలిపారు. ఎకరానికి 26 క్వింటాళ్ల దిగుబడి చొప్పున లెక్కకట్టి సన్నరకం ధాన్యం సాగు చేసిన రైతులకు బోనస్ చెల్లించాలని ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు రాజపూర్ణానందం, పాపాయి పవన్, భోగా ఆనంద్, ఏనుగు రాజేశ్వర్ తదితరులున్నారు.

నిలిచిన ఎస్సారెస్పీ నీటి విడుదల!

- ఆయకట్టుకు 78 టీఎంసీల నీటి వినియోగం
- అత్యధికంగా వరద కాలువ ద్వారా 40.25 టీఎంసీలు
- కాకతీయ కాలువ ద్వారా 34.43 టీఎంసీలు..



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ప్రస్తుత నీటి మట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆయకట్టుకు నీటి విడుదలను అధికారులు నిలిపివేశారు. ఖరీఫ్ సీజన్ పంటలు రైతుల చేతికందడంతో కాలువల ద్వారా నీటి విడుదల నిలిచింది. ఆయకట్టుకు అధికారులు సుమారు 78 టీఎంసీల నీటిని వదిలారు. ఈ ఏడాది ప్రాజెక్ట్‌లోకి ఇప్పటి వరకు ఎగువ ప్రాంతాల నుంచి 278 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. మహారాష్ట్ర భూభాగంలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లను మూసివేయడంతో కేవలం 1400 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగుల కాగా గురువారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండు కుండలా ఉందని అధికారులు తెలిపారు.

117.5 టీఎంసీలు గోదావరి పాలు

ఎస్సారెస్పీ నుంచి ఈ ఏడాది ఇప్పటి వరకు 117.5 టీఎంసీల వరద నీరు గోదావరి పాలైంది. ఇందులో 108.36 టీఎంసీలు వరద గేట్ల ద్వారా, 9.27 టీఎంసీలు ఎస్కేప్ గేట్ల ద్వారా దిగువ గోదావరిలోకి విడుదల చేశారు. ఆవిరి రూపంలో ఇప్పటి వరకు 6.43 టీఎంసీల నీరు పోగా, తాగు నీటి అవసరాల కోసం మిషన్ భగీరథకు 3.15 టీఎంసీల నీటిని వినియోగించారు.

పదో తేదీ వరకు సరస్వతి కాలువకు..

నిర్మల్ జిల్లాలో వరినాట్లు ఆలస్యంగా వేయడం, ఆయకట్టుకు నీటి అవసరం ఉండడంతో సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. ఈనెల 10వ తేదీ వరకు నీటిని విడుదల కొనసాగే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

78 టీఎంసీల విడుదల ఇలా..

కాలువ	విడుదలైన నీరు
వరద	40.25
కాకతీయ	34.43
సరస్వతి	2.56
లక్ష్మి	0.78
గుత్పలిఫ్ట్	0.119
అలీసాగర్ లిఫ్ట్	0.16

విద్యుదుత్పత్తికి బ్రేక్

ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల నిలిచిపోవడంతో విద్యుదుత్పత్తికి బ్రేక్ పడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 45.23 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. మళ్లీ యాసంగి సీజన్‌కు కాకతీయ కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తే జలవిద్యుదుత్పత్తి కేంద్రంలో ఉత్పత్తి ప్రారంభం కానుంది.

క్లుప్తంగా

ఆర్టీసీ స్పెషల్‌ హైర్‌ బస్సులపై భారీ తగ్గింపు



ఖలీల్‌వాడి: వివాహాలు, దైవదర్శనాలతో పాటు తీర్థ, విహార యాత్రలకు వెళ్లే వారికి ఆర్టీసీ స్పెషల్‌ బస్సులపై సుమారు 20 శాతం ధరలు తగ్గించినట్లు నిజామాబాద్‌ రీజినల్‌ మేనేజర్‌ కె జానీరెడ్డి గురువారం తెలిపారు. శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తులకు ప్రత్యేక రాయితీ ఉన్నట్లు పేర్కొన్నారు. విజ్ఞాన యాత్రలకు వెళ్లే విద్యార్థుల కోసం అదనంగా 10 శాతం రాయితీ ఉందన్నారు. ముందస్తు రిజర్వేషన్‌ కు ఆర్టీసీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. బస్సు ల వివరాల కోసం ఆర్మూర్‌-7382843133,బోధన్‌-9849500725,నిజామాబాద్‌-9959226022,బాన్సువాడ-9491105706,కామారెడ్డి-84682 20281 నంబర్లను సంప్రదించాలన్నారు.

వ్యవసాయ కమిషన్‌ సమావేశంలో గడుగు



నిజామాబాద్‌ సిటీ: రాష్ట్ర వ్యవసాయ కమిషన్‌ గురువారం హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో సమావేశమైంది. చైర్మన్‌ కోదండరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కమిషన్‌ సభ్యుడు గడుగు గంగాధర్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్‌ మాట్లాడుతూ.. మన దేశంలోకి హరిత విప్లవం తీసుకొచ్చిన మహానేత దివంగత ఇందిరాగాంధీకే దక్కుతుందన్నారు. హరితవిప్లవంతో వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు వచ్చాయని అన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాలు కరువు



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రిలో రోగులకు సరైన సౌకర్యాలు అందడం లేదని ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి సుజాత అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో గురువారం ఆస్పత్రిని సందర్శించి రోగుల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం స్పందించి రోగులకు సరైన సౌకర్యాలు కల్పించకుంటే ఆందోళనలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో కటారి లావణ్య, చౌదర్పల్లి వనజ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సన్నాలకు పెరిగిన డిమాండ్‌

- జై శ్రీరాంకు రూ.3వేలు
- సన్నరకాల్లో అత్యంత సన్నమైన ధాన్యం ఇదే..
- ప్రైవేటు వ్యాపారులతో ముందస్తు ఒప్పందం చేసుకుంటున్న రైతులు



మోర్తాడ్‌లో ఆరబోసిన సన్నరకం ధాన్యం

మోర్తాడ్‌: సన్న రకాల్లో అత్యంత సన్న రకమైన జైశ్రీరాంకు మార్కెట్‌లో డిమాండ్‌ బాగా ఉంది. బీపీటీ, హెచ్‌ఎంటీ లాంటి సన్న రకాలకు క్వింటాలుకు రూ.2,300 ఉండగా జైశ్రీరాం రకానికి రూ.3 వేలు పలుకుతోంది. ఈ రకం ధాన్యం కోతలు ఇంకా మొదలు కాలేవు. ముందస్తుగానే రైతులు, వ్యాపారుల మధ్య ధర ఒప్పందం జరుగుతోంది. జైశ్రీరాం రకం బియ్యాన్ని ఎక్కువ మంది భోజనం చేసేందుకు ఇష్టపడుతుండటంతో ఈ రకం ధాన్యానికి మొదటి నుంచి మంచి డిమాండ్‌ ఉంది. జిల్లాలో దాదాపు 5వేల ఎకరాల్లో జైశ్రీరాం రకం ధాన్యం సాగై ఉంటుందని అంచనా. జైశ్రీరాం రకాన్ని ప్రైవేటు విత్తన కంపెనీలు ఉత్పత్తి చేయగా ఈ రకం పంట దిగుబడి చేతికి అందడానికి సాధారణ రకాల కంటే కొంత ఎక్కువ సమయం పడుతుంది. బెంగళూర్‌, హైదరాబాద్‌లకు ఎక్కువగా ఎగుమతి అయ్యే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో జైశ్రీరాం రకం విక్రయిస్తే ధర ఆశించిన విధంగా లభించదు. ఒక వేళ బోనస్‌ వర్తించినా తమకు లాభం ఉండదనే ఉద్దేశంతో రైతులు వ్యాపారులకే విక్రయించాలని నిర్ణయించుకుంటున్నారు. గతంలోనూ వ్యాపారులకే జైశ్రీరాం రకం ధాన్యాన్ని విక్రయించిన రైతులు ఈ సారి కూడా అదే విధానాన్ని అవలంబిస్తున్నారు. కొంత మంది రైతులు ఎలాంటి రసాయనాలు వినియోగించకుండా తమ ఇంటి కోసం, కొంత ధాన్యాన్ని ఎక్కువ ధరకు విక్రయించడానికి సాగు చేయడం విశేషం. ఏది ఏమైనా జైశ్రీరాం రకానికి డిమాండ్‌ ప్రతి ఏటా పెరుగుతుందని చెప్పొచ్చు.

బాలోత్సవాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బాలోత్సవ ప్రతినిధులు నర్రా రామారావు, డాక్టర్‌ జయని నెహ్రూ

మోపాల్‌: మండల కేంద్రంలోని ప్రెసిడెన్సీ స్కూల్‌లో ఈ నెల 12, 13వ తేదీల్లో నిర్వహించే బాలోత్సవం, చదువుల పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాలోత్సవ ప్రతినిధులు నర్రా రామారావు, డాక్టర్‌ జయని నెహ్రూ కోరారు. మండల శివారులోని ప్రెసిడెన్సీ స్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సంతోషంగా ఆడుతూ, పాడుతూ నేర్చుకునే స్ఫూర్తిదాయకమైన కార్యక్రమం ఈ బాలోత్సవమని తెలిపారు. జన విజ్ఞాన వేదిక, మల్లు స్వరాజ్యం ట్రస్ట్‌, ఆల్‌ పెన్షనర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. రెండ్రోజులపాటు విద్యార్థులకు వివిధ విభాగాల్లో ప్రదర్శనలిస్తారని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులకు వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. బాలోత్సవంలో జూనియర్స్‌, సీనియర్స్‌ విభాగాల్లో విద్యార్థులకు పోటీలు ఉంటాయని, జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 3వేలకుపైన విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సహకరించి విద్యార్థులను సకాలంలో పంపించాలని కోరారు. సమావేశంలో ప్రతినిధులు రామ్మోహన్‌రావు, పవన్‌కుమార్‌, ఈవీఎల్‌ నారాయణ, ప్రసాదరావు, కోయేడి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సీఐలకు స్థానచలనం

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో సీఐల బదిలీలు చేస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. నిజామాబాద్‌ పీసీఆర్‌లో ఉన్న బుక్క శ్రీనివాస్‌ను నార్త్‌ రూరల్‌ సీఐగా నియమించగా ఇక్కడ పని చేసిన సతీశ్‌కుమార్‌ ఐజీపీ కార్యాలయానికి, అలాగే ఐజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌ లిస్టులో ఉన్న పంతంగి సత్యనారాయణను ఆర్మూర్‌ టౌన్‌కు బదిలీ చేశారు. ఆర్మూర్‌లో పని చేసిన రవికుమార్‌ను ఐజీపీ కార్యాలయంలో రిపోర్ట్‌ చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఐజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌ లిస్టులో ఉన్న రెడ్డిబోయిన కృష్ణను రుద్రూర్‌ సీఐగా బదిలీ చేయగా అక్కడ పని చేసిన సీఐ జయేశ్‌రెడ్డిని ఐజీపీ ఆఫీస్‌కు అటాచ్‌ చేశారు. నిజామాబాద్‌ టాస్క్‌ ఫోర్స్‌ సీఐగా విధులు నిర్వహిస్తున్న పురుషోత్తంను రామగుండం ట్రాఫిక్‌ సీఐగా బదిలీ చేశారు. జిల్లాలో మరికొందరి సీఐల బదిలీలు జరిగే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం పోలీస్‌ వర్గాల్లో వినిపిస్తోంది.

రాష్ట్ర చెస్‌ టోర్నీ పరిశీలకులుగా రమేశ్‌



నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్‌ అండర్‌-14 బాలబాలికల రాష్ట్రస్థాయి చెస్‌ టోర్నీకి జిల్లాకు చెందిన వ్యాయమ ఉపాధ్యాయుడు అగుట్ల రమేశ్‌ పరిశీలకులుగా ఎంపికయ్యారు. ఈ నెల 8 నుంచి 10వరకు మేడ్చల్‌ మల్కాజిరిగి జిల్లాలో నిర్వహించే టోర్నమెంట్‌కు పరిశీలకులుగా వెళ్లనున్నారు. రమేశ్‌ నవీపేట్‌ మండలం జెడ్పీ స్కూల్‌లో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో సక్కి అశోక్‌, ఉపాధ్యాయులు రమేశ్‌కు అభినందనలు తెలిపారు.

బీరు సీసాలో కప్ప అవశేషాలు!

- డొంకేశ్వర్‌ వైన్స్‌లో ఘటన



డొంకేశ్వర్‌: బీరు సీసాలో కప్ప మాదిరి అవశేషాలు కనిపించాయి. ఈ ఘటన డొంకేశ్వర్‌ మండల కేంద్రంలోని వైన్‌ షాపులో చోటు చేసుకుంది. మండలానికి చెందిన ఓ వ్యక్తి బ్లాక్‌ బస్టర్‌ బీర్‌ను కొనుగోలు చేశాడు. అందులో నల్లగా చెత్త మాదిరిగా కనిపించడంతో బీరు సీసాను తిరిగి వైన్స్‌ వద్దకు తెచ్చాడు. ఆగ్రహం వ్యక్తం చేసిన సదరు వ్యక్తికి వైన్స్‌ నిర్వాహకులు డబ్బులు వాపస్‌ ఇచ్చేశారు. ఐతే, ఈ వీడియో ఆలస్యంగా బయటకు వచ్చింది. గురువారం సామాజిక మాధ్యమాల్లో జిల్లా వ్యాప్తంగా వైరల్‌ అయింది. దీనిపై ఎక్సైజ్‌ సీఐ దిలీప్‌ను వివరణ కోరగా, బీరులో ఉన్నది కప్ప అవశేషం కాదని, చెత్తలాంటి పదార్థమని తెలిపారు. దీనిపై విచారణ చేస్తున్నారని పేర్కొన్నారు.

బీజేపీ నాయకుడు రోషన్‌లాల్‌ బోరా సస్పెండ్‌

సుభాష్‌నగర్‌: బీజేపీ నియమ నిబంధనలు ఉల్లంఘించి, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించినందుకు నిజామాబాద్‌ అర్బన్‌ నియోజకవర్గంలోని కంఠేశ్వర్‌ మండల అధ్యక్షుడు రోషన్‌లాల్‌ బోరాను ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్‌ చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ పటేల్‌ కులాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సస్పెన్షన్‌ తక్షణమే అమల్లోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు.

గడువులోగా సర్వే పూర్తి చేయాలి

- సర్వే, ఆన్‌లైన్‌లో నమోదు ఏకకాలంలో చేపట్టాలి
- సమీక్షాసమావేశంలో ప్రత్యేక అధికారి శరత్‌



నిజామాబాద్‌ అర్బన్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను నిర్దేశిత గడువులోగా పూర్తిచేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ఏ శరత్‌ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌ అండ్‌ బీ అతిథిగృహంలో గురువారం అధికారులు నిర్వహించిన సమావేశంలో ఇంటింటి సర్వే ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటిని ఎన్యూమరేటర్లు సందర్శించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో పక్కాగా కుటుంబ వివరాలు సేకరించేలా చూడాలన్నారు. సర్వే తీరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని, అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఒక్కో ఎన్యూమరేటర్‌ ప్రతిరోజూ సగటున 15 ఇళ్ల వివరాలను సేకరించేలా చూడాలన్నారు. ఇంటింటి సర్వే, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు ప్రక్రియను ఏకకాలంలో చేపట్టాలన్నారు. కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. హౌజ్‌ లిస్టింగ్‌ ప్రక్రియ కొనసాగుతోందని, ఈ నెల 9 నుంచి సమగ్ర కుటుంబ వివరాల సేకరణ కోసం అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశామని, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లను అన్నివిధాలుగా సన్నద్ధం చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా నివాస గృహాల సంఖ్యకు అనుగుణంగా 3247 ఎన్యూమరేషన్‌ బ్లాక్‌లను ఏర్పాటు చేసి ఎన్యూమరేటర్లను నియమించడంతోపాటు పర్యవేక్షణ కోసం 356 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. నిర్దిష్ట గడువులోపు సర్వే ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ట్రెయినీ ట్రెయినీ కలెక్టర్‌ సంకేత్‌కుమార్‌, డీఆర్డీవో సాయాగౌడ్‌, డీఎస్‌వో అరవింద్‌ రెడ్డి, సివిల్‌ సప్లయీస్‌ డీఎం రాజేశ్వర్‌, డీసీవో శ్రీనివాస్‌, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగూరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



బహుమతులు అందజేస్తున్న డీఈవో అశోక్‌

మోపాల్‌: విద్యార్థులు తయారు చేసిన వేస్ట్‌ టు వెల్త్‌ ప్రాజెక్టులు అద్భుతంగా ఉన్నాయని, పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని డీఈవో అశోక్‌ పిలుపునిచ్చారు. గురువారం నగర శివారులోని బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ, ఎన్‌జీసీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వేస్ట్‌ టు వెల్త్‌ ఎగ్జిబిషన్‌ నిర్వహించారు. మొత్తం 42 పాఠశాలల నుంచి 84 మంది విద్యార్థులు, వారి గైడ్‌ టీచర్లు ప్రదర్శనలిచ్చారు. ప్రతి పాఠశాల నుంచి వేస్ట్‌ మెటీరియల్‌తో ఉపయోగకరమైన అనేక వస్తువులను వివిధ అంశాలతో తయారు చేసి ప్రదర్శించారు. వీటిలో మూడు ప్రాజెక్టులను ఎంపిక చేయగా, మొదటిస్థానంలో సుద్దపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌, రెండో స్థానంలో కోటగల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మూడోస్థానంలో జైతాపూర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి నగదు బహుమతి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం డీఈవో అశోక్‌ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు పాటుపడే క్రమంలో రియూస్‌, రెడ్యూస్‌, రీ సైకిల్‌ అనే నినాదాలను దృష్టిలో పెట్టుకుని వస్తువులను ఉపయోగించాలని తెలిపారు. ఏకో ఫ్రెండ్లీ ఐటమ్స్‌ వాడాలని, ప్లాస్టిక్‌ నిరోధించడం, మొక్కల పెంపకం, సంరక్షణ వంటి వాటిని బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్‌ అధికారి కె గంగాకిషన్‌, రాష్ట్ర ప్రాజెక్ట్‌ అధికారి, ఎన్‌జీసీ అధికారి విద్యాసాగర్‌, ఎంఈవో గేమ్‌సింగ్‌, పాఠశాల హెచ్‌ఎం శంకర్‌, గోవర్ధన్‌, సాయిబాబా, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పెషల్‌ ఎడ్యుకేషన్‌ ఎంపిక చేసుకోవడం గర్వకారణం



వినీలను సన్మానిస్తున్న మాజీ ఉప సర్పంచ్‌ సుజాత

కోటగిరి(రుద్రూర్‌): ప్రత్యేకావసరాలు గల పిల్లలకు పాఠాలు చెప్పాలనే ధ్యేయంతో స్పెషల్‌ ఎడ్యుకేషన్‌ను ఎంపిక చేసుకుని సక్సెస్‌ అయిన హంగర్గా వినీల అభినందనలు అందుకుంటోంది. కోటగిరి మండల కేంద్రానికి చెందిన దివంగత జర్నలిస్ట్‌ హంగర్గా గంగాధర్‌, మాజీ సర్పంచ్‌ హంగర్గ స్వరూప కుమార్తె హెచ్‌ వినీల. స్పెషల్‌ ఎడ్యుకేషన్‌లో డీఎడ్‌ పూర్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీఎస్సీ ఫలితాల్లో ప్రత్యేక విభాగంలో జిల్లాలో మూడో ర్యాంకు సాధించి ప్రభుత్వ ఉద్యోగం పొందే కలను సాకారం చేసుకుంది. తన భర్త, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో లక్ష్యాన్ని అందుకున్నట్లు వినీల పేర్కొంది. కోటగిరి మండలంలోని ఎత్తొండ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తోంది. ఎత్తొండ మాజీ ఉప సర్పంచ్‌ సుజాతదేవేందర్‌ ఆధ్వర్యంలో వినీలను స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ.. వినీల కుటుంబం ప్రజాసేవకు తొలి ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. యువత లక్ష్య సాధనలో వినీలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

లారీ నుంచి 300 లీటర్ల డీజిల్‌ చోరీ

భిక్కనూరు: మండల సమీపంలోని జాతీయ రహదారి పక్కన నిలిచి ఉన్న లారీ నుంచి మూడు వందల లీటర్ల డీజిల్‌ను దుండగులు దొంగిలించినట్లు ఎస్సై సాయికుమార్‌ గురువారం పేర్కొన్నారు. బుధవారం అర్ధరాత్రి ఓ లారీ డ్రైవర్‌ జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ దాబా హోటల్‌ వద్ద లారీని నిలిపి పడుకున్నాడు. వేకువ జామున లేచి చూడగా డీజిల్‌ ట్యాంక్‌ మూత తెరిచి ఉంది. అందులో ఉన్న మూడు వందల లీటర్ల డీజిల్‌ చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఏజెంట్‌ మోసంతో బ్యాంక్‌ ఎదుట నిరసన



ఖలీల్‌వాడి: నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న కెనరా బ్యాంకు ఎదుట జనార్దన్‌ అనే వ్యక్తి గురువారం అర్ధనగ్నంగా నిరసన తెలిపాడు. బాధితుడు తెలిపిన ప్రకారం.. నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన జనార్దన్‌ కెనరా బ్యాంక్‌లో వ్యక్తిగత రుణాలు తీసుకున్నాడు. రుణాలకు సంబంధించిన నెలవారి చెల్లింపులు నందిపేట్‌కు చెందిన ఏజెంట్‌ నవీన్‌కు ప్రతి నెలా ఇచ్చేవాడు. నవీన్‌ బ్యాంక్‌లో వాయిదా చెల్లింపులు చేపట్టలేదు. దీంతో జనార్దన్‌ తన సీబిల్‌ స్కోర్‌ తగ్గడాన్ని చూసి బ్యాంకులో విచారణ చేపట్టి ఏజెంట్‌ను నిలదీశాడు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా తీసుకున్న వాయిదా డబ్బులు చెల్లిస్తానని పీఎస్‌లో ఒప్పందం జరిగింది. కానీ ఇంత వరకు తాను చెల్లించిన వాయిదా డబ్బులను ఏజెంట్‌ బ్యాంకులో చెల్లించక పోవడంతో నిరసన చేపట్టినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఈ విషయమై బ్యాంక్‌ మేనేజర్‌ వంశీని వివరణ కోరగా.. బ్యాంకులో క్లియరెన్స్‌ ఉన్నాయని, ఏజెంట్‌ ద్వారా జరిగిన లావాదేవీలపై విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వ్యవసాయ క్షేత్రంలో మాజీ ఎమ్మెల్యే బిజీ బిజీ





మొన్నటి వరకు రాజకీయాల్లో బిజీబిజీగా ఉన్న ఆర్టీసీ మాజీ చైర్మన్‌, నిజామాబాద్‌ రూరల్‌ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ ప్రస్తుతం డిచ్‌పల్లి మండలం బీబీపూర్‌ శివారులోని తన వ్యవసాయ క్షేత్రంలో బిజీ బిజీగా ఉన్నారు. తన వ్యవసాయ క్షేత్రంలో కోసి ఆరబెట్టిన వడ్లను తానే స్వయంగా ఆరబోశారు. - సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌

పోలీసు వారెంట్‌ దుర్వినియోగం !

ఖలీల్‌ వాడి: నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలోని ఓ పోలీస్‌ అధికారి వారెంట్‌తో ఆర్టీసీ బస్సులో తన ఇంటికి వెళ్లి తిరిగి వచ్చిన ఘటన జిల్లా పోలీసు శాఖలో కలకలం రేపింది. సాధారణంగా పోలీసు సిబ్బంది కేసులకు సంబంధించి బస్సు చార్జీల మినహాయింపు కోసం వారెంట్‌తో బస్సుల్లో ప్రయాణిస్తారు. అయితే జిల్లా కేంద్రానికి చెందిన సదరు పోలీసు ఉన్నతాధికారి మాత్రం హైదరాబాద్‌లోని తన ఇంటికి వెళ్లి రావడం చర్చనీయాంశమైంది. అధికారి కేవలం రూ.800 చార్జీల కోసం ఇలా చేయడం సరికాదని కిందిస్థాయి సిబ్బంది అంటున్నారు.

క్రైం కార్నర్‌

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య



నాగవ్వ(ఫైల్‌)

గాంధారి: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు జీవితంపై విరక్తితో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన గాంధారి మండలం గండివేట్‌లో చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గండివేట్‌కు చెందిన ద్యానబోయిన నాగవ్వ(71) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. బుధవారం మధ్యాహ్నం సీతాయిపల్లికి వెళ్లి డాక్టర్‌ వద్ద చూయించుకుంటానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పలు చోట్ల వెతికారు. గురువారం గండివేట్‌ గ్రామ సమీపంలో ఉన్న పీర్ల చెరువువద్ద వృద్ధురాలి చెప్పులు ఉన్నట్లు గ్రామస్తులు గుర్తించారు. దీంతో చెరువులో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతురాలి కుమారుడు భాస్కర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు



ఎడపల్లి: ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన ఎడపల్లి శివారులోని పెట్రోల్‌బంక్‌లో సమీపంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఎడపల్లికి చెందిన పల్లికొండ సాయిలు గ్రామ శివారులోని పెట్రోల్‌బంక్‌లో పెట్రోల్‌పోయించుకొని తిరిగి వస్తుండగా బోధన్‌ నుంచి నిజామాబాద్‌ వైపు వస్తున్న మహారాష్ట్ర ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొన్నది. ఈ ఘటనలో సాయిలుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు స్థానికులు నిజామాబాద్‌లోని ప్రయివేట్‌ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అనారోగ్యంతో తడిహిప్పర్గ పీఠాధిపతి మృతి



మద్నూర్‌: మండలంలోని తడిహిప్పర్గ దత్తాత్రి ఆలయ పీఠాధిపతి శేషారావు మహరాజ్‌(65) అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడన్నారు. ఉదయం తడిహిప్పర్గలో నిర్వహించిన మహారాజ్‌ అంత్యక్రియలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ముగ్గురిపై కేసు నమోదు

మోపాల్‌: మండలంలోని మంచిప్ప గ్రామానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో యాదగిరిగౌడ్‌ గురువారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల మంచిప్పలో ధాన్యం బస్తాలు పడి రాజయ్య వాహనం అదుపు తప్పి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రాజయ్య కుమారుడు రాజేందర్‌ ఆయన స్నేహితులు రాజు, వంశీ కోపంతో లారీ అద్దాలు, హెడ్‌లైట్లు పగులగొట్టి డ్రైవర్‌పై దాడి చేశారు. లారీ యజమాని ఫిర్యాదు మేరకు రాజేందర్‌, రాజు, వంశీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

అర్ధరాత్రి పాన్‌ షాప్‌ తెరిచిన వ్యక్తికి జైలు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఒకటో టౌన్‌ పీఎస్‌ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా బుధవారం అర్ధరాత్రి వరకు పాన్‌ షాప్‌ తెరిచి ఉంచినందుకు నిర్వాహకుడు ఎండీ రిజ్వాన్‌కు సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి గురువారం తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాల నిర్వాహకులు తమకు కేటాయించిన సమయాల్లో మూసిఉంచాలని లేకుంటే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రెండు దుకాణాల్లో చోరీ



వర్ని: మండల కేంద్రంలోని కిరాణ, పెయింట్‌ దుకాణాల్లో గురువారం తెల్లవారుజామున దుండగులు చొరబడి నగదు, వస్తువులను ఎత్తుకెళ్లారు. ఈ రెండు దుకాణాల్లో కలిపి రూ. 30 వేల నగదు, విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. పోలీసులు క్లూస్‌ టీం ద్వారా ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

బోధన్‌రూరల్‌: మండలంలోని ఊట్‌పల్లికి చెందిన బానవత్‌ జయవర్ధన్‌ అనే యువకుడు అదృశ్యమైనట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. బోధన్‌లోని మైనారిటీ హాస్టల్‌లో ఉంటూ ఇంటర్‌ చదువుతున్నాడు. దసరా పండుగకు స్వగ్రామం ఊట్‌పల్లిలోని తన ఇంటికి వచ్చాడు. దసరా మరుసటి రోజు ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. తల్లి గిరిజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిక్కడపల్లిలో వృద్ధురాలు..



ఎల్లవ్వ

రుద్రూర్‌: మండలంలోని చిక్కడపల్లికి చెందిన మచ్కురి ఎల్లవ్వ అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై సాయన్న తెలిపారు. గత నెల 14న ఇంటి నుంచి వెళ్లిన ఎల్లవ్వ తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుళ్లినస్థితిలో మృతదేహం లభ్యం

కామారెడ్డి క్రైం: హత్య చేసి సంచిలో మృతదేహాన్ని మూటకట్టి పడేసిన ఘటన కామారెడ్డి రైల్వే స్టేషన్‌ సమీపంలోని రైల్వే ట్రాక్‌ పక్కన గురువారం వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. పంచముఖి హనుమాన్‌ ఆలయానికి సమీపంలో రైల్వే ట్రాక్‌ పక్కన పడి ఉన్న ఓ ప్లాస్టిక్‌ సంచి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. సంచిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉంది. చనిపోయిన వ్యక్తి తెలుపు, నీలం రంగు షర్టు, నీలం రంగు జీన్స్‌ ప్యాంట్‌ ధరించి ఉన్నాడు. అతని కుడి చేతిపై ర వి నర్వాడే వైశాలి, ఆర్‌వీఐ అని పచ్చబొట్టుతో రాసి ఉంది. సదరు వ్యక్తిని ఎక్కడో హత్య చేసి ఈ ప్రాంతంలో పడేసినట్లుగా తెలుస్తోందని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే పోలీసులను సంప్రదించాలని కోరారు.

గల్లంతైన యువతి మృతదేహం..



బాసర: అప్పుల బాధ, వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ కుటుంబం బుధవారం నిర్మల్‌ జిల్లా బాసర గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్‌లోని న్యాల్‌కల్‌కు చెందిన వేణు మృతిచెందగా, భార్య అనురాధ ప్రాణాలతో బయటపడింది. కుమార్తె పూర్ణిమ గల్లంతైంది. గురువారం ఉదయం పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం మృతదేహం లభ్యమైంది. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బాసర ఎస్సై గణేశ్‌ పేర్కొన్నారు.

భార్యను హింసించిన భర్తకు ఏడాది జైలు

ఖలీల్‌వాడి: రెండో వివాహం కోసం భార్యను హింసించిన భర్తకు నిజామాబాద్‌ జ్యుడీషియల్‌ ఫస్ట్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ వడ్డి హరికుమార్‌ ఏడాది జైలు శిక్షను విధిస్తూ తీర్పు వెలువరించారు. అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ భూసారపు రాజేశ్‌గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మాక్లూర్‌ మండలంలోని దాస్‌నగర్‌కు చెందిన ర్యాపని దేవదాస్‌కు నవీపేట్‌కు చెందిన రేఖతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. దేవదాసుకు ఓ మహిళతో అక్రమ సంబంధం ఏర్పడి ఆ మహిళను పెళ్లి చేసుకునేందుకు ఇష్టపడి భార్య రేఖను శారీరక, మానసికంగా హింసలకు గురి చేసేవాడు. దీంతో అతనిపై కేసు నమోదైంది. విచారణలో దేవదాస్‌పై ఆరోపణలు రుజువు కావడంతో జడ్జి ఏడాది జైలు శిక్షతో పాటు రూ. ఐదువేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా మూడు నెలల జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో జడ్జి హరికుమార్‌ పేర్కొన్నారు.